విజయనగరం ఉత్సవాల్లో కళా ప్రదర్శనకు అవకాశం

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో కళాప్రదర్శనకు అవకాశం కల్పిస్తున్నామని వేదిక ఇన్‌చార్జి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 5, 6 తేదీల్లో మహారాజా సంగీత కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, పాల్గొనదలచిన వారు తమ వివరాలను సంగీత నృత్య కళాశాలలో అందజేయాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 30 ఆఖరు తేదీగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 63002 18551, 93986 27642 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

అడుగడుగునా నీరాజనం

- సిరిమాను చెట్టుకు దారి పొడవునా పూజలు చేసిన భక్తులు
- స్వల్ప అటంకం అనంతరం విజయనగరం చేరిక


సిరిమాను చెట్టు తొలగింపు ప్రక్రియను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు 24: విజయనగరం జై పైడిమాంబ నామస్మరణతో మార్మోగింది. సిరిమాను చెట్టుకు అడుగడుగునా నీరాజనం పలికిన భక్తులతో పులకించింది. పైడిమాంబ సిరిమాను చెట్టు ఊరేగింపు గంట్యాడ మండలం తామరాపల్లిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత మొదలైంది. రాత్రి 8.45 గంటలకు విజయనగరం చేరుకుంది. సిరిమాను రాకకోసం భక్తులు దారిపొడవునా పసుపునీళ్లతో ఎదురుచూశారు. ప్రతి కూడలి వద్ద సిరిమానుకు పూజలు చేసి పసుపు నీళ్లలో అభిషేకాలు చేశారు. సాయంత్రం నుంచి సిరిమాను ఎప్పుడు వస్తుందా? అని చిన్న,పెద్ద అంతా రోడ్లపైనే వేచి ఉన్నారు. దాదాపు 25 కిలోమీటర్ల దూరం నుంచి సిరిమాను, ఇరుసుమాను చెట్లను నాటుబళ్లపై విజయనగరం తరలించారు. ఊరేగింపులో సాంస్కృతిక ప్రదర్శనలు, పులివేషాలు, బ్యాండు మేళాలు సందడి చేశాయి. విజయనగరం చేరుకున్న సిరిమాను కలెక్టరేట్ మీదుగా పోలీసు బ్యారక్స్ (మిగతా 10వ పేజీలో..)


విజయనగరంలో భక్తుల కోలాహలం నడుమ ముందుకు కదులుతున్న సిరిమాను చెట్టు

భోగాపురంలో పనిచేయలేం!

- ఆందోళన చెందుతున్న ఉద్యోగులు
- రాజకీయ ఒత్తిళ్లతో సతమతం
- బదిలీల కోసం ప్రయత్నాలు



భోగాపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు భోగాపురం మండలానికి రావడానికి ఉద్యోగులు పోటీ పడేవారు. ఉద్యోగులకు కొంత స్వేచ్ఛ లభించేది. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కూటమి ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య విభేదాలతో అధికారులు నలిగిపోతున్నారు. ఎవరి మాట వినాలో.. వినకూడదో దిక్కుతోచనిస్థితిలో ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో వచ్చిన కొద్దిరోజులకే బదిలీ చేయించుకోవడమో.. సెలవు పెట్టి వెళ్లిపోవడమో చేస్తున్నారు. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే నాగమాధవి, టీడీపీ నాయకుల మధ్య విభేదాలు ఉన్నాయి. తరచూ బహిరంగంగానే ఇరుపార్టీల కార్యకర్తలు విమర్శలు గుప్పించుకుంటూ ఉంటారు. పనులు, ప్రజా సమస్యలపై అధికారులపై ఇరుపార్టీల నేతలు ఒత్తిళ్లు తెస్తుంటారు. దీంతో అధికారులు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు. ఇటీవల ఇద్దరు ఎంపీడీవోలు కొన్ని నెలలు మాత్రమే పనిచేసి వెళ్లిపోయారు. దీన్నిబట్టి ఇక్కడి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల తరువాత విధుల్లో చేరిన ఎంపీడీవో కిషోర్‌కుమార్ కొన్ని నెలలు మాత్రమే పనిచేశారు. ఒత్తిడి తట్టుకోలేక లాంగ్ లీవ్ పెట్టి తప్పుకున్నారు. అనంతరం ఇక్కడ ఈవో పీఆర్‌డీగా విధులు (మిగతా 10వ పేజీలో..)



షెడ్యూల్డ్ ఏరియాలో కలుపుతారా?


ఎస్.కోట మండలం దారపర్తి పంచాయతీ శివారు గిరిశిఖర ఆవాసంలో నివసిస్తున్న ఓ కుటుంబం

- రాష్ట్రంలో 496 గిరిజన గ్రామాలను షెడ్యూల్ ప్రాంత పరిధిలోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు వచ్చాయి. యాభై శాతం కంటే ఎక్కువ మంది గిరిజనులున్న గ్రామాల వివరాలను తీసుకోవాలని కలెక్టర్‌లు, ఐటీడీఏ పీవోలకు సూచించాం. వీటిపై రాష్ట్ర గిరిజన సలహా మండలి సిఫార్సులతో మంత్రి వర్గ సమావేశంలో చర్చిస్తాం. నివేదికను గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం. ఇంకా ఎక్కడైనా అభివృద్ధి కాని గిరిజన గ్రామాలుంటే ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు పంపించవచ్చు.

- శాసనసభలో మాడుగుల ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు గిరిజన మంత్రి సంధ్యారాణి చెప్పిన సమాధానం.



- జిల్లా గిరిజనుల్లో ఓ పక్క ఆశ.. మరో పక్క సందేహం
- తాజాగా శాసన సభలో చర్చ
- హామీ ఇచ్చిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి
- పునర్విభజనలో ఐటీడీఏను కోల్పోయిన గిరిజనం
- వారి భూముల్లో అమలు కాని 1/70 యాక్ట్
- విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి, అభివృద్ధికి దూరంగా జీవనం

శృంగవరపుకోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ఏరియాలో గిరిజన గ్రామాలను కలిపే ప్రతిపాదనపై శాసనసభలో సోమవారం జరిగిన చర్చతో జిల్లాలో ఉన్న నాన్ షెడ్యూల్ ఏరియా గిరిజనుల్లో ఓ పక్క ఆశ, మరో పక్క సందేహం నెలకొంది. జిల్లాకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) లేకపోవడమే సందేహానికి కారణం. గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియలో జిల్లాను విభజించింది. అంతవరకు జిల్లా పరిధిలో వున్న పార్వతీపురం ఐటీడీఏ నూతనంగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో కలిసిపోయింది. జిల్లా పరిధిలోని నాన్ షెడ్యూల్ ఏరియాలో నివశిస్తున్న గిరిజనులకు ఎంతోకొంత అందే ఐటీడీఏ సేవలు నిలిచిపోయాయి.

ఐటీడీఏలో కలిసుండే గిరిజన గ్రామాలకు వివిధ రకాలుగా మేలు కలుగుతుంటుంది. దీన్ని గుర్తించిన నాన్ షెడ్యూల్ గ్రామాల గిరిజనులు 1970 నుంచి డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు శాసన సభలో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతున్నాయి. గిరిజన జనాభా అధికంగా ఉండి అభివృద్ధికి నోచుకోని గ్రామాలను షెడ్యూల్ ఏరియాగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అయితే ఉన్నాయి. అయినప్పటికీ ఈ ప్రక్రియ అమలు కావడం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిసారించింది. అర్హతున్న గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో కలిపేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అడుగులు (మిగతా 10వ పేజీలో..)

విజయవాడకు కొత్త మాస్టార్లు

- నేడు సీఎం చేతుల మీదుగా పోస్టింగ్ ఆర్డర్లు అందజేత



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త గురువులు బుధవారం రాత్రి విజయవాడ చేరుకున్నారు. గురువారం సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందుకోనున్నారు. ఉమ్మడి జిల్లాలో 578 ఖాళీ టీచర్ పోస్టులకు 578 మందిని ఎంపిక చేయగా.. కొత్త గురువులంతా వారి సహాయకులతో కలిసి ఉదయమే డెంకాడ మండలం మోదవలస ఓయోస్టార్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చేరుకున్నారు. అక్కడ అధికారులు వారికి అల్పాహారం అందించారు. అనంతరం గుర్తింపు కార్డులిచ్చారు. టీమ్‌లుగా ఏర్పాటు చేసి లీడర్ల సహకారంతో వారికి కేటాయించిన బస్సుల్లోకి పంపారు. మొత్తంగా 40 బస్సుల్లో విజయవాడకు బయల్దేరారు. 20 మంది ఎస్కార్ట్, 12 మంది (మిగతా 10వ పేజీలో..)

వినతులపై సానుకూలంగా వ్యవహరించాలి

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందిన వినతులపై సానుకూలంగా వ్యవహరించాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఓటర్ల జాబితా సవరణ, రీసర్వే, పీజీఆర్ఎస్, హౌస్ సైట్‌లు (మిగతా 10వ పేజీలో..)



తోటపల్లికి స్వల్ప వరద

8

వర్షం వస్తే వణుకే


నది దాటేందుకు ఈ స్తంభాలే ఆధారం


వర్షాకాలంలో రాకపోకలు ఇలా..

- ప్రాణాలు తోడేస్తున్న చంపావతి నది
- ఏటా పశుసంపదకూ భారీనష్టం
- వంతెన కోసం దశాబ్దాలుగా నిరీక్షణ
- వానాకాలంలో రాకపోకలు బంద్

వర్షం పడి చంపావతి ఉప్పొంగితే ఆ గ్రామాల వారికి వణుకే. మనుషులు, పశు సంపద కొట్టుకుపోయి బాధిత కుటుంబాలకు తీరని శోకం మిగులుతోంది. వంతెన నిర్మాణం కోసం నాలుగు దశాబ్దాలుగా నిరీక్షిస్తున్నారు. అయినా ఒక్క అడుగూ పడలేదు. నేతలు, అధికారుల అలసత్వం ఫలితంగా తాజాగా మరో కుటుంబం ఆందోళన చెందుతోంది. ఇంటి పెద్ద గల్లంతై ఆచూకీ లభించక టెన్షన్ పడుతోంది. ఆగూరు పంచాయతీ రెల్లిగూడెం, సొరాడవలస, మల్లెడువలస, సంగంగుడ్డి వలస, గూడెం గ్రామాల ప్రజలు సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న కష్టాలివీ..

మెంటాడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మెంటాడ మీదుగా ప్రవహించే చంపావతి నదికి పశ్చిమాన ఆగూరు పంచాయతీతోపాటు ఐదు శివారు గ్రామాలున్నాయి. వేసవిలో ఇబ్బందులు లేనప్పటికీ వర్షాకాలంలో చంపావతి పొంగిదంటే ఆయా గ్రామాల వెన్నులో వణుకు మొదలవుతుంది. బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. వరద తగ్గుముఖం పట్టేవరకు స్వీయ నిర్బంధం పాటిస్తుంటారు. ఎటువంటి అత్యవసర పరిస్థితుల్లోనూ బయటి ప్రపంచంలో అడుగుపెట్టలేని దుస్థితి వారిది. తప్పనిసరి పరిస్థితుల్లో (మిగతా 10వ పేజీలో..)


పశువుల కాపరి కోసం నదిలో గాలిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం

ఆన్‌లైన్‌లో నీటి తీరువా చెల్లింపు 8

తపాలా బీమా లక్ష్యం రూ.1,550 కోట్లు 8

త్వరలో 'జైకా' పనుల ప్రారంభం 8


సిరిమానుచెట్టును తరలిస్తున్న దృశ్యం

అడుగడుగునా నీరాజనం

- సిరిమాను చెట్టుకు భక్తుల పూజలు
- భారీ బందోబస్తు మధ్య తరలింపు

గంట్యాడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'జై పైడిమాంబ..' అంటూ భక్తుల నినాదాలు...మహిళల మంగళ హారతులు...పసుపు నీటితో పూజలు...ఇవీ పైడిమాంబ సిరిమాను చెట్టు తరలింపులో కనిపించిన దృశ్యాలు. అడుగడుగునా సిరిమాను చెట్టుకు నీరాజనాలు పలికారు. ప్రతి కూడలిలో భారీ సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. కొండతామరాపల్లి గ్రామంలోని గుర్తించిన సిరిమాను చెట్టు కు బుధవారం ఉదయం 8.30 గంటలకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గొడ్డలితో గాట్లు పెట్టి సిరిమాను త యారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పూజారి వెంకటరావు సమక్షంలో సిరిమాను చెట్టును కోయడం ప్రారంభించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ ప్రక్రియను పూర్తి చేశారు. అక్కడకి వచ్చిన వారికి అన్నదాన కార్య క్రమం చేపట్టారు. మూడు గంటల సమయలో సిరిమాను చెట్టును విజయనగరం జిల్లా కేంద్రంలోని హుకుంపేటకు తరలించే ప్రక్రియ ప్రారంభించారు. నాటు బండ్లపై సిరిమాను చెట్టును తరలించారు. తామరాపల్లి నుంచి అయ్యన్నపేటకు వచ్చే ప్రతి కూడలిలో పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై పసుపు, కుంకుమ కలిపిన నీటిని బిందెలతో పోసి పూజలు చేశారు. వివిధ కూడళ్లలో మండల టీడీపీ నాయకుల సమక్షంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, అటవీ, రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.


సిరిమానుకు బిందెలతో నీరు పోస్తున్న భక్తులు

ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- సిరిమాను, ఇరుసుమాను చెట్లను కొట్టే ప్రక్రియకు శ్రీకారం

గంట్యాడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లమ్మ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం గంట్యాడ మండలం కొండతామరాపల్లి గ్రామంలో వెలసిన పైడితల్లమ్మ వారి ప్రతి రూపంగా భావించే సిరిమాను చెట్టును మంత్రి శ్రీనివాస్ సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల జయజయధ్వానాల మధ్య చెట్టుకి గొడ్డలితో గాట్లు పెట్టి సిరిమాను తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పైడిమాంబ విజయానికి ప్రతిరూపమన్నారు. అమ్మవారి సిరిమాను పండుగను, దాంతో పాటుగా విజయనగరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అమ్మవారు సిరిమాను రూపంలో తమ నియోజకవర్గ పరిధిలోని గంట్యాడ మండలంలో ప్రత్యక్షం కావడం తమ అదృష్టమన్నారు. అమ్మవారు రాష్ట్రాన్ని చల్లగా చూడాలని, పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉద్యోగాలు రావాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులనాయుడు, తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్వి, ఆర్‌డీఓ కీర్తి, ఆలయ సహాయ కమిషనర్ శిరీష, డీఎఫ్‌ఓ కొండలరావు, డీఎస్పీ గోవిందరావు, ఎంఆర్‌ఓ నీలకంఠేశ్వర రెడ్డి, పూజారి బంటుపల్లి వెంకటరావు, సిరిమాను, ఇరుసుమాను చెట్ల దాతలైన రైతులు చల్లా అప్పలనాయుడు, నారాయణ మూర్తి, రామకృష్ణ, లోకవరపు సత్యం, అధికారులు భక్తులు పాల్గొన్నారు.


సిరిమాను చెట్టును కొడుతున్న మంత్రి శ్రీనివాస్

తోటపల్లికి స్వల్ప వరద

గరుగుబిల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి బుధవారం స్వల్ప వరద ప్రవాహం వచ్చింది. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా పైప్రాంతాల నుంచి నదిలోకి 6,500 క్యూసెక్కులకు పైగా వరద చేరుతోంది. అధికారులు అప్రమత్తమై దిగువకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.40 మీటర్ల నిల్వ సామర్థ్యం ఉంది. సాగునీటి అవసరాలకు ప్రధాన కాలువల నుంచి 1320 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. వర్షాలు అధికంగా కురిసినట్లయితే వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.


స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు విడుదల చేసిన వరద ప్రవాహం

అసెంబ్లీలో మన వాణి

మొక్కజొన్న పంటకు రాయితీలు ఇవ్వాలి

- ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఒకప్పుడు చెరకు పంట బాగా పండించే వారని... చక్కెర పరిశ్రమలు సంక్షోభంలో కూరుకుపోవడంతో రైతులంతా మొక్కజొన్న పంట సాగువైపు మొగ్గు చూపుతున్నారని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఆయన రైతుల సమస్యలను ప్రస్తావించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలాగానే మొక్కజొన్ననూ సేకరించాలని, రాయితీలను అమలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఖరీఫ్, రబీ సీజన్లలలో మెట్టు, పల్లపు భూములలో మొక్కజొన్న పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నందున వ్యవసాయమంత్రి ఈ విషయాన్ని పరిశీలించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. శ్రీగంధం, ఎర్రచందనం మొక్కల సాగు విషయంలో చాలా మంది రైతులు మోసాలకు గురవుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని కంపెనీలు నకిలీ మొక్కలు ఇచ్చి మోసం చేస్తుండడంతో రైతులంతా నష్టపోతున్నారన్నారు. అలాంటి రైతులను ఆదుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలి

- ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

పాలకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో పాలకవర్గ సమావేశాలు జరిగేలా గిరిజన సంక్షేమ శాఖ మం త్రి గుమ్మిడి సంధ్యారాణి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహించలేదని చెప్పారు. ఉమ్మడి శ్రీకాకులం జిల్లాలో ఉన్న సీతంపేట ఐటీడీఏ విభజనలో పార్వతీపురం మన్యం జిల్లాలోకి చేరిందన్నారు. మన్యం, లేదా శ్రీకాకుళం జిల్లా అధికారులు ఎవరు పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలో తెలియక తర్జనభర్జన పడుతున్నారని తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలంలో 20 సబ్‌ప్లాన్ మండలాలు ఉన్నాయని తెలిపారు. సమావేశాలు నిర్వహించకపోవడంతో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకొనే అవకాశం ప్రజాప్రతినిధులు, అధికారులకు లేకుండా పోతోందన్నారు. నిబంధనల మేరకు పాలకవర్గ సమావేశాలు సకాలంలో నిర్వహిస్తే ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చొరవ తీసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

తపాలా బీమా లక్ష్యం రూ.1,550 కోట్లు

- ఏపీ సర్కిల్ ఏడీ శివనాగరాజు

బొబ్బిలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో తపాలా శాఖ ఏపీ సర్కిల్‌లో రూ.1,550 కోట్ల బీమా సేకరణ లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు తెలిపారు. బొబ్బిలి పట్టణంలో బుధవారం తపాలాశాఖ డివిజన్ స్థాయి మూడు రోజుల మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శివనాగరాజు ప్రసంగించారు. గత ఆర్థిక సంవత్సరంలో 95 శాతం మేర బీమా లక్ష్యాలను సాధించామని తెలిపారు. ఈ ఏడాది 30 శాతం అదనంగా లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ నెల 26 వరకు మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా బీమా సంకల్ప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రూ.30 కోట్ల బీమా వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. మొదటి రోజునే రూ.10 కోట్ల వ్యాపారం చేశామన్నారు. పార్వతీపురం డివిజన్ పరిధిలో రూ. 1.25 కోట్లు లక్ష్యం కాగా, అంతకుమించి మించి వ్యాపారం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మందికి తపాలా బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఏఎస్‌పీలు ఎం.సత్యనారాయణ, ఐ.మురళి మాట్లాడుతూ కేవలం రూ.550 తో రూ.10లక్షల ఆరోగ్య బీమా, రూ.2,199తో కుటుంబానికి అంతటికీ రూ.15 లక్షల బీమా సదుపాయం అంది స్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎల్‌ఐ డీఓ రవిబాబు, కె.శ్రీనివాసరావు తదిత రులు పాల్గొన్నారు. బీమా వ్యాపార లక్ష్యాలను సాధించిన వారికి జ్ఞాపికలను అందజేశారు.


మాట్లాడుతున ఏడీ శివనాగరాజు

శ్మశానాన్నీ వదల్లేదు

- అందులోనే వరి సాగు
- దహన సంస్కారాలకు అవస్థలు

కొమరాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వన్నాం పంచాయతీ ఈదులవలస గ్రామంలో శ్మశాన వాటిక ఆక్రమణకు గురికావడంతో మృతదేహాలను తీసుకెళ్లేందుకు, దహన సంస్కారాలు చేసేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈదులవలస గ్రామంలో బుధవారం వంజరాపు తిరుపతి అనే వ్యక్తి మృతి చెందారు. మృతదేహాన్ని దహన సంస్కారాల నిమిత్తం కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శ్మశాన వాటికకు తీసుకొని బయలుదేరారు. అక్కడ వరి పంట సాగు చేసి ఉండడంతో ఇబ్బందులు పడ్డారు. తరతరాలుగా వినియోగిస్తున్న శ్మశాన వాటికను కొందరు ఆక్రమించుకున్నారని గ్రామస్థులు ఆరోపించారు. గతంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అధికారులు స్పందించి... ఆ స్థలాన్ని స్థానికులకు అప్పగించారని చెప్పారు. అయినా మళ్లీ ఆక్రమణకు గురైందని చెబుతున్నారు. ఆక్రమణదారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే ధర్నా చేస్తామని గ్రామ పెద్దలు వంజరాపు మల్లేశ్వరరావు, తాతబాబు, పల్ల సురేష్, రామారావు, భోగేశ్వరరావు, రాజేష్, పత్తి మురళి, పాలక మురళి, గణపతి, రమణ, సురేష్ తదితరులు తెలిపారు.


ఆక్రమణకు గురైన స్థలం మీదుగా మృతదేహాన్ని తీసుకొని వెళుతున్న దృశ్యం

ఆన్‌లైన్‌లో నీటి తీరువా చెల్లింపు

- రైతులకు అవగాహన లోపం
- ఇంకా అనేకచోట్ల పాత విధానంలోనే..

గజపతినగరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నీటి తీరువా చెల్లింపులో ఇంకా మీరు పాత పద్ధతిలోనేనడుస్తున్నారా? నగదు చెల్లించి... రశీదుల కోసం తిరుగుతున్నారా? పాత రశీదు దొరకలేదని అధికారులు సాకులు చెబితే... బకాయిలతో కలిపి ఇప్పుడు కట్టాల్సి వస్తోందా? ఆ పాత పద్ధతులు పాటించనవసరం లేదు. ఆన్‌లైన్‌లో మీరు నీటి తీరువా చెల్లించవచ్చు. దాదాపు ఆరేళ్లుగా ఈ పద్ధతి అమలులో ఉన్నప్పటికీ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇంకా పాత విధానంపైనే ఆధారపడుతున్నారు. వాస్తవానికి 2019 వరకు పాత విధానంలో నీటి తీరువా వసూలు చేసేవారు. పల్లం భూమికి గతంలో ఎకరాకు వంద రూపాయలు ఉంటే ప్రస్తుతం ఎకరాకు రూ.200 వసూలు చేస్తున్నారు. గతంలో రైతు నీటి పన్ను కొంత మొత్తం కట్టినా... పూర్తి బకాయి చెల్లించినా గ్రామ రెవెన్యూ అధికారులు రశీదులు ఇచ్చేవారు. నిర్ణీత కాలం దాటితే పాత రశీదు ఆధారంగా బకాయిలు ఎంత? లేదా పూర్తిగా చెల్లించ లేదా అనే అంశాలు తెలిసేవి. ఒక వేళ పాత రశీదు కనిపించకుండా పోతే మొత్తం నగదును చెల్లించేదాకా రైతులపై ఒత్తిడి తీసుకువచ్చేవారు. ఈ క్రమంలో 2019లో రైతులకు మేలు కలిగించేలా చంద్రబాబునాయుడు రెండు ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిలో ఒకటి మ్యుటేషన్‌లో మార్పు...రెండు నీటి పన్ను చెల్లింపులో మార్పు

అంతా ఆన్‌లైన్

భూమి ఒకరి పేరు మీద నుంచి మరొకరి పేరుకు రిజిస్ట్రేషన్ జరిగిన తరువాత కొద్ది రోజుల్లోనే ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ జరిగేలా నూతన విధానానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారు. దీని వల్ల రైతులు తమ వివరాలను భూ రికార్డుల్లో నమోదు చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండాపోయింది. దీంతో నీటి తీరువాను ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం కల్పించారు. పాత విధానంలో నీటి తీరువా చెల్లింపుల్లో కొందరు ఉద్యోగులు సొంత రశీదులు రైతులకు అందించడంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడేది. దీంతో నీటి పన్ను విధానాన్ని ఆన్‌లైన్ చేశారు.

రైతు ఖాతా నెంబర్ ఓపెన్ చేస్తే భూమి మొత్తం విస్తీర్ణం, నీటి పన్ను చెల్లింపుల వివరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు కనిపిస్తుంటాయి. పట్టణాల్లో ఆస్తిపన్ను చెల్లింపుల విధానంలా రైతులు సంబంధిత సచివాలయాలు, మీసేవ, సెల్‌ఫోన్ ద్వారా నీటి పన్నును ప్రభుత్వానికి చెల్లించవచ్చు. బకాయిల వివరాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి. దీంతో పాత విధానం తరహాలో రశీదులపై ఆధారపడడం...అవి పోయాయనే కారణంతో మొత్తంగా చెల్లించడం వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు.

అవగాహన లేక..

నీటి తీరువాను ఆన్‌లైన్‌లో చెల్లించే విధానంపై రైతులకు అవగాహన లేదు. దీనిపై రైతులకు అవగాహన కల్పించడంలో రెవెన్యూ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఇంకా అనేక మంది రైతులు వీఆర్వోలు తమ వద్దకు రాలేదనే ఉద్దేశంతో రెండు, మూడేళ్లుగా నీటి పన్ను చెల్లించకుండా ఉండిపోయినట్టు తెలుస్తోంది. దీని వల్ల అటు రైతులకు బకాయిలు భారం కావడంతో పాటు ఇటు ప్రభుత్వానికి ఆదాయం రాకుండా పోతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని నీటి తీరువా ఆన్‌లైన్ చెల్లింపులపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



బంగారమిస్తా!

- తూకంలో తేడా చూపించిన వారికి బహుమానం
- రాజాంలోని రేషన్ డిపో వద్ద వినూత్నంగా బోర్డు

రాజాం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజాంలోని నరసింహనగర్ కాలనీ రేషన్ డిపో వద్ద ఉన్న ఓ బోర్డు ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఆ డిపో డీలర్ పి.గణేష్ ఆ బోర్డు ఏర్పాటు చేశాడు. 'మీకు ఇచ్చే రేషన్‌లో గ్రాము బియ్యం తగ్గినా...గ్రాము బంగారం ఇవ్వబడును' అని ఆ బోర్డుపై రాశాడు. తన వద్ద బియ్యం తూకంలో ఎన్ని గ్రాములు తేడా వస్తే అన్ని గ్రాముల బంగారం ఇస్తానని బహిరంగంగా చెబుతున్నాడు. అంతటితో ఆగకుండా రేషన్ బియ్యం అమ్మినా... కొనుగోలు చేసినా నేరమంటూ మరో బోర్డు పెట్టాడు. ప్రభుత్వం న్యాయబద్ధంగా అందించే కమీషన్ తనకు సరిపోతుందని చెబుతున్నాడు గణేష్. ఆ బోర్డును ఇప్పుడు స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



రేషన్ డిపో వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

త్వరలో 'జైకా' పనుల ప్రారంభం

- ఇరిగేషన్ ఎస్ఈ అప్పారావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ


బొబ్బిలి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఇరిగేషన్ సర్కిల్‌లో మైనర్, మీడియం దీర్ఘకాలంగా పెండింగ్ పనులకు కదలిక వస్తుందని.. కొత్తగా మరికొన్ని పనులకు ప్రతిపాదనలు చేపట్టామని సూపరింటెండెంటింగ్ ఇంజనీరు ఆర్. అప్పారావు తెలిపారు. వివిధ అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: జైకా నిధులతో చేపట్టిన పనుల ప్రగతి ఎలా ఉంది?

జవాబు: ఇన్నాళ్లూ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయి. వీటికి సంబంధించి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు 2027 మార్చి వరకు గడువును పొడిగించింది. దీనితో పనులు పునఃప్రారంభం అవుతాయి. జైకా నిధులను వెంగళరాయసాగర్, వట్టిగెడ్డ, పెదంకలాం, పెద్దగెడ్డ ఇరిగేషన్ వనరుల ఆధునికీకరణ పనుల కోసం నిర్దేశించారు.

ప్ర: తోటపల్లి బ్యారేజీ పనుల ప్రగతి ఎలా ఉంది?

జ: నార్మల్ స్టేట్ ప్లాన్ (ఎన్ఎస్‌పీ) కింద తోటపల్లి బ్యారేజీకి రూ.11.54 కోట్లు ఖర్చు చేశాం. ఇంకా రూ.3.50 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పాత రెగ్యులేటర్, కాలువ పనులు చేయాల్సి ఉంది.


అప్పారావు

ప్ర: జైకా నిధులతో ఏఏ పనులు చేపడు తున్నారు?

జ: వెంగళరాయసాగర్‌కు రూ63.5 కోట్లు మంజూరు చేయగా... రూ.10.09 కోట్లు పనులు జరిగాయి. ఇంకా రూ.8.29 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వట్టిగెడ్డకు రూ.45.84 కోట్లు మంజూరు కాగా, రూ.3.90 కోట్ల పనులు పూర్తయ్యాయి. పెద్దగెడ్డకు రూ.28.10 కోట్లు మంజూరు కాగా, రూ.2 కోట్ల పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.1.47 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. పెదంకలాంకు రూ.17.3 కోట్లు మంజూరైతే రూ.0.65 కోట్ల పనులు పూర్తయ్యాయి. రూ.0.36 కోట్ల పనులు చేపట్టాల్సి ఉంది.

ప్ర: ప్రకృతి వైపరీత్యాలతో పాడైన వనరుల మాటేమిటి?

జ: 2023-24లో స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్ కింద ఐదు ప్రాజెక్టుల పరిధిలో రూ.118.23 లక్షలు మంజూరయ్యాయి. వాటిలో మూడు పనులను రూ.49.58 లక్షలతో పూర్తి చేశాం.

ప్ర: ఓ అండ్ ఎం నిధులతో ఏఏ పనులు చేప ట్టారు?

జ: ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ నిధుల కింద 56 పనులకు రూ.181.01 లక్షలు మంజూరయ్యాయి. వాటిలో 37 పనులను పూర్తి చేశాం. 28 పనులు ప్రారంభం కాలేదు.

ప్ర: కొత్తగా ఇరిగేషన్ పనుల ప్రతిపాదనలు ఉన్నాయా?

జ: ట్రిపుల్ ఆర్ (రిపేర్- రినోవేషన్-రెస్టోరేషన్) కింద 27 పనులకు రూ.2351.95 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. మరో 21 పనులకు అంచనాలను రూపొందిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున భాగస్వామ్యంతో ఈ నిధులు మంజూరు కానున్నాయి.

ప్ర: ఈ పనులన్నిటినీ ఏ ప్రాతిపదికన చేపడతారు?

జ: రూ.10 లక్షల లోపు విలువ చేసే పనులను ఆయకట్టుదారుల సంఘాల ద్వారా నిర్వహిస్తాం. మిగిలినవి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు టెండర్లు పిలుస్తాం.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

● జిల్లాలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి కోరారు. బుధవారం జిల్లాలోని పలు సచివాలయాలు, రెవెన్యూ, మండలపరిషత్ కార్యాలయాలను పరిశీలించి రికార్డులు తనిఖీచేశారు. బాధ్యతలు స్వీకరించిన తొలిసారి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అందుతున్నసేవలపై ఆరాతీశారు.

అధికారులు సమన్వయంతో ముందుకుసాగాలి

చీపురుపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రతి విభాగం సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ ఎస్. రామసుందర్‌రెడ్డి ఆదేశించారు.చీపురుపల్లి ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి, అక్కడి అధికారులతో ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో వ్యవసాయానికి అవసరమైన సహకారం అందజేయాలన్నారు. రైతులకు ఎరువుల సరఫరా సజావుగా జరిగేలా చూడాలన్నారు. తొలుత ఆయన గరివిడి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, అధికారులు, సిబ్బంతో మాట్లాడారు. ఆయన వెంట ఆర్డీవో బి. ఆశయ్య, డీఎల్‌డీవో హేమసుందర్, డీఎస్పీ బి.రాఘవులు, సీఐ జి. శంకరరావు, ఎంపీడీవో ఐ.సురేష్, తహసీల్దారు డి. ధర్మరాజు పాల్గొన్నారు.

●గరివిడి,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి):గరివిడిలోనికొండపాలెం సచివాలయ కార్యాలయంలో రికార్డులను కలెక్టర్ రామసుందర్‌రెడ్డి పరిశీలించారు.



గరివిడి: పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న రామసుందర్‌రెడ్డి

కార్యక్రమంలో గరివిడి తహసీల్దార్ బంగారు రాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో మధు, పంచాయతీ ఈవో నాగమణి, సర్పంచ్ ప్రమీల కుమారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంట్యాడ సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) గంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కేవీ రూరల్ ఫీడర్ బ్రేకర్ రిమూవ్ వర్క్ కోసం సబ్ స్టేషన్ బస్ లైన్ క్లియరెన్స్ ఇవ్వనున్నారు. ఈ మేరకు గురువారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకూ ఫీడర్ పరిధిలో ఉన్న అన్నిగ్రామాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయనగరం టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.త్రినాథరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంపీడీవోలు బాధ్యతల స్వీకరణ

వంగర,సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా టి.రాజారావుబుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఎంపీడీవో స్పంగారపు రఘు జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లారు. నందిగాం ఈవోపీర్డీ రాజారావు పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

●భోగాపురం,సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా మక్కువ ఎంపీడీవో డి.స్వరూపరాణిని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన గాయిత్రి సెలవుపై వెళ్లిపోయారు. ఈసందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ మండలాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు. కాగా ఎంపీడీవోకి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. పంచాయతీల కార్యదర్శులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్‌గా నారాయణరావు

రాజాం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజాంకు చెందిన బీజేపీ నాయకుడు కోటగిరి నారాయణరావు బుధవారం విజయవాడలో ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారంచేశారు.కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు జొన్నాడరంజిత్,నాయకులు చిన్నంనాయుడు, జిల్లా కార్యదర్శి గుడివాడ నాగరాజు, బొబ్బిలి, తెర్లాం మండలాల బీజేపీ అధ్యక్షులు తాడి ఈశ్వరరావు, గొల్లపూడి సాయి కుమార్, జిల్లా కోశాధికారి బండి సత్యనారాయణ పాల్గొన్నారు.

రూ.50 వేల విరాళం

భోగాపురం, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): పోలిపల్లిలో దేవీ నవరాత్రులు పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహణకు మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు బుధవారం కమిటీ సభ్యులకు రూ.50వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు.

మృదంగ విద్వాంసుడు సత్యం మృతి



సత్యం(ఫైల్)

విజయనగరం రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మృదంగ విద్వాంసుడు వెంప డాపు సత్యం (76)మంగళవారంరాత్రి మృతి చెందారు. పోలంకి వెంకటరాజు, కాటరావుల పల్లి వీరభద్రరావు శిష్యుని ఉండేవారు. హరి కథకి మృదంగ సహకారం అందించేవారు. నగరంలోని మృదంగ విద్వాంసులు వి.అప్పలస్వామి, డాక్టరు మండపాక రవి, రాధాకృష్ణ, శివకుమార్, మహేశ్వరరావు, విద్వాంసులు కాళ్ల నిర్మల, రోటరీ మ్యూజిక్ అకాడమీ అధ్యాపకులు, విద్యార్థులు, ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్‌సభ్యులు, వయోలిన్ విద్వాంసులు త్రినాథరావు, సుబ్బరాజు నివాళులర్పించారు.

డ్వామా భవనంలోకి డిగ్రీ కళాశాల

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):విజయనగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రి సమీపంలోగల డ్వామా భవనంలోకి తరలించారు.ఈమేరకు బుధవారం ప్రారంభోత్సవంచేశారు.ప్రిన్సిపాల్ కె.రేఖ అధ్యక్షతన పూజలు నిర్వహించారు. ప్రభుత్వ సాంస్కృతిక కళాశాల నుంచి మిమ్స్ కళాశాలకు గత కలెక్టరు బీఆర్‌అంబేడ్కర్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా కళాశాలను తరలించామని కె.రేఖ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అప్పారావు, జయపాల్‌రావు, రూపారాణి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కను నాటాలని జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మానవాళి మనుగడకు ఈ మొక్కలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, వి.మణికుమార్, డాక్టరు ఎన్.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పార్క్‌కు కేటాయింపుతో నీటికి ఇబ్బందులు

●ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్



అమ్మపాలెం రైతుసేవా కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

శృంగవరపుకోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్ నుంచి జిందాల్ భూముల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్క్‌కు నీటిని కేటాయించడంతో సాగునీటికి ఇబ్బందులువస్తామని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ తెలిపారు.జిందాల్ భూనిర్వాసితులు నిరసన తెలుపుకొనేందుకు జనసంచారం లేని ప్రదేశంలో పోలీసులు అనుమతి ఇవ్వడం అన్యాయమని ఆరోపించారు. హైకోర్టు సూచనతో బహిరంగ ప్రదేశంలో జిందాల్ భూనిర్వాసితులు నిరసన తెలుపుకోనేందుకు పోలీస్ శాఖ అనుమతి ఇవ్వడంతో బుధవారం శృంగవరపుకోట మండలం మూలబొడవర పంచాయతీ అమ్మపాలెం రైతు సేవా కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ సెక్షన్ 30ను చూపించి అనుమతులు ఇవ్వడం లేదన్నారు. ఎమ్మెల్సీఇందుకూరి రఘురాజు జిందాల్‌కు అప్పగించిన భూముల సమస్యను ప్రస్తావించడంతో న్యాయం జరుగుతుందని ఆశపడుతున్నట్లు నిర్వాసితులు పేర్కొన్నారు.

పాటలు పాడి.. బాణాలతో ఊరేగి..

● ఒంపల్లిలో పాఠశాల విద్యార్థుల దసరా ఉత్సవాలు



బాణాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

బొండపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఒంపల్లిలో ఆదర్శపాఠశాల విద్యార్థులు సంప్రదాయాలను గుర్తుచేశారు.బుధవారం దసరాఉత్సవాల్లో భాగంగా సందడిగా దసరా పాటలుపాడి కర్రతో తయారుచేసిన బాణాలతో ఊరేగించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం, ఆదివాసీఉపాధ్యాయ అసోషియేషన్ అధ్యక్షులు ఆసరి తవిటందొర మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువ కలిగేలా ప్రోత్సహం అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్‌తో ఎరువుల పిచికారీపై అవగాహన

గజపతినగరం,సెప్టెంబర్24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిన్నాం గ్రామంలో డ్రోన్ ద్వారా ఎరువులను పిచికారీ చేయడంపై ఏవో కిరణ్‌కుమార్ రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వ్యవశాయ అధికారుల సూచనలు, సలహాలు తప్పని సరిగా పాటించాలని కోరారు.

మెరుగైన సేవలు అందించడానికి కృషి

బొండపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఈ ఏడాది కాలంలో మరింతగా చేరువగా ఉండి మెరుగైన సేవలను అందించడానికి కృషి చేయనున్నట్టు ఎంపీపీ చల్లా చలంనాయుడు పేర్కొన్నారు.ఎంపీపీగాబాధ్యతలు చేపట్టి నాలుగేళ్ల పూర్తిచేసుకోవడంతో ఆయన చాంబర్‌లో బుధవారం కేక్‌కట్‌చేశారు. కార్యక్రమంలో పీఆర్ జేఈఈ పి.అప్పలనాయుడు, బొండపల్లి ఎంపీటీసీ సభ్యుడు బి.శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

సరస్ ఎగ్జిబిషన్‌కు సమన్వయంతో పనిచేయాలి

విజయనగరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలు పురస్కరించుకుని ట్యాంకుబండ్ రోడ్డులో నిర్వహించనున్న సరస ఎగ్జిబిషన్‌కోసం విద్యుత్, వైద్య, ఆరోగ్యశాఖ, పోలీసు, నగరపాలక సంస్థ, అగ్నిమాపకశాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌పాణి కోరారు. బుధవారం విజయనగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలతో సమన్వయం చేసుకుని మహిళా సంఘాలు సరస్‌లో పాల్గొనేలా చూడాలన్నారు. ఏపీ నుంచి పాల్గొంటున్న సరస్ నిర్వాహకులకు లక్కీడిప్ ద్వారా స్టాళ్ల కేటాయించనున్నట్లు తెలిపారు. శానిటేషన్, క్లీనింగు, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు, మంచినీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నగరపాలక సంస్థ కమిషనర్‌తో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.ట్రాఫిక్‌నకు అంతరాయం లేకుండా వేర్వేరుగా మార్గాలు చూపించాలన్నారు.

సరస్ పోస్టర్‌ను ఆవిష్కరణ

విజయనగరం కలెక్టరేట్ సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఈనెల 28 నుంచి ఏర్పాటు చేయనున్న అఖిలభారత డ్వాక్రా బజారుకు (సరస్) సంబంధించి పోస్టర్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం రాత్రి కలెక్టరు చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలోని కలెక్టరు రామసుందర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, ఏపీడీ సావిత్రి పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

రాజాం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీ పరిధిలోని పదో వార్డుకు చెందిన టీడీపీనాయకుడు కాటం అప్పారావు ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారంపరామర్శించారు.అనంతరం పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి టీడీపీకార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయుకులు కోండ్రు జగదీష్, సుమల వెంకట మన్మథరావు, గురవాన నారాయణరావు, కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు, వంగా వెంకటరావు, పొట్నూరు లక్ష్మణరావు, గేదెల బాలమురళీ, నాగళ్ల రామ పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

డెంకాడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏవో టి.సంగీత కోరారు. మండలంలోని పినతాడివాడలో పొలంబడి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అచ్చింనాయుడు, వ్యవసాయ విస్తరణాధికారి బి.రామకోటి, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.రాంబాబు పాల్గొన్నారు.

జంతు సంక్షేమ కమిటీ ఏర్పాటు చేయండి

శృంగవరపుకోట (జామి) సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):జామిలో జంతు సంక్షేమ కమిటీని ఏర్పాటు చేయాలని గోసంరక్షణ సమైక్య రాష్ట్ర కార్యదర్శి కేదారిశెట్టి సత్యనారాయణ కోరారు.ఈ మేరకు తహసీల్దార్ కృష్ణంరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, బి.సంధ్యారాణి, సాహినీ రేణుక, పైడిరాజు పాల్గొన్నారు.

సంగీత కళాశాలలో భరతనాట్య ప్రదర్శన

విజయనగరంరూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):విజయనగరంలోని సంగీత కళాశాలలో బుధవారం భరతనాట్యం పదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో తమ్మిన సాహితీ ప్రియ, షణ్ముఖప్రియ, కోమలి, తనూష, ప్రియనందిని భరతనాట్యం ప్రదర్శించారు.

ఆయిల్‌పామ్‌తో ఏడాదంతా ఆదాయం

కొత్తవలస, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్‌తో ఏడాదంతా ఆదాయం వస్తుందని ఉద్యానవనాల శాఖాధికారి పి.పద్మ తెలిపారు. బుధవారం మండలంలోని వీరభద్రపురంలో రైతులకు ఆయిల్‌పామ్‌లు పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగు విధానం, రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథ కం-2025 కింద కొత్తగా ఆయిల్‌పామ్ తోటలు విస్తరణ, వాటి నిర్వహణకు నాలుగు సంవత్సరాలు పాటు రాయితీలను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల్లో బొప్పాయి, మొక్కజొన్న, అరటి, కూరగాయలను అంతర పంటలుగా వేసుకోవచ్చని చెప్పారు.

అప్పలనాయుడు సేవలు స్ఫూర్తిదాయకం

●రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళితో పాటు వక్తల ఘన నివాళి

రేగిడి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిగా అప్పలనాయుడు మాస్టరు సేవలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని, ఆయన అడుగుజాడల్లో ఉపాధ్యాయులు నడవాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు, కోండ్రు జగదీష్, ఏపీటీ ఎఫ్ నేతలతోపాటు పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన విశ్రాంత ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం వారాడ అప్పలనాయుడు ఇటీవల మృతిచెందిన విషయం విదితమే. బుధవారం దశదినకర్మ పురస్కరించుకుని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ అధ్యక్షతన సంతాపసభ నిర్వహించారు.ఈసందర్భంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బార్ల ప్రసాదరావు,అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాసరావు, విశ్రాంత డీఎస్పీ కె.భార్గవ్‌నాయుడు, ఆర్టీసీ మేనేజర్ జి.మహేంద్రపాత్రుడు, ఏపీటీఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు చిన్నాల అచ్యుతరావు, ఎంఈవో బి.గౌరినాయుడు తదితరులు మాట్లాడుతూ అప్పలనాయుడు సామాజిక స్పృహతో ఎన్నో సామాజికచైతన్య కార్యక్రమాలతోపాటుఉపాధ్యాయుడుగా ఎంతోమందికి విద్యాదానంచేసి ఉన్నతులుగా తీర్చిదిద్దిన వ్యక్తిఅని కొనియాడారు. కార్యక్రమంలో అప్పలనాయుడు కుటుంబ సభ్యులు, కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ పర్సనల్ సెక్రటరీ ఉత్తరావల్లి మజ్జినాయుడు, జి.సూర్యంమాస్టర్, టీడీపీనేతలు దూబధర్మారావు, కిమిడి అశోక్, పి.రామచంద్ర నాయుడు, ధనంజయ, రాజాం, పాలకొండ, రేగిడి ఏపీటీఎఫ్ నేతలు, రాజాం ఏఎంసీ ఛైర్మన్ గురవాన నారాయణరావు, పాలవలస రమణమూర్తి, మాస్టర్ అల్లుడు పాలవలస అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అప్పలనాయుడు మాస్టర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



అప్పలనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోండ్రు మురళీమోహన్

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

మహిళలు ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారులు తెలిపారు. బుధవారం జిల్లాలో పలుచోట్ల స్వస్తినారీ స్వశక్ పరివార్‌అభియాన్ కార్య క్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

● గజపతినగరం,సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):ప్రతిరోజూ గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి రోగులకు మెరుగైన సేవలు అందజేయనున్నట్లు జిల్లా లెప్రసీఅండ్ ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి రాణి తెలిపారు. పురిటిపెంట గ్రామసచివాలయం పరిధిలోగల హెల్త్ సబ్‌సెంటర్‌లో వైద్యసేలను పరిశీలించారు.కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణారెడ్డి, ఏఎన్ఎం సత్యవతి పాల్గొన్నారు.

● భోగాపురం, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి):భోగాపురం ఎస్సీ, బీసీ కాలనీలో 158 మందికి తనిఖీలు చేసి మందులు అందజేశారు.

● గరివిడి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరులో గరివిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 187 మందికి పరీక్షలుచేశారు. కార్యక్రమంలో అడపా సూర్యనారాయణ, ఎలకల వెంకునాయుడు, గేదెల ఆదినారాయణ, గేదెల శంకర్, సన్యాసి పాల్గొన్నారు.

● రాజాం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):పెనుబాకలో బొద్దాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. వైద్యులు సిద్దేశ్వరి, శరణ్ 125 మంది మహిళలకు తనిఖీలు చేశారు. కార్య క్రమంలో జడ్పీటీసీ నర్సింహులు పాల్గొన్నారు.

●లక్కవరపుకోట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కల్లేపల్లి, మల్లివీడుల్లో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ ఆరోగ్య తనిఖీల్లో 93 శాతం మంది షుగర్, బీపీలతో బాధపడుతున్నవారిని గుర్తించినట్లు వైద్యులు అనిల్‌కుమార్ తెలిపారు. కల్లేపల్లిలో 160 మందికి తనిఖీలు నిర్వహించగా 90 మందికి పైగా బీపీ, 60 మందికి పైగా షుగర్ , మల్లివీడులో 152 మందికి పరీక్షలు చేస్తే 80 పైగా బీపీ, 60కిపైగా షుగర్ రోగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో వైద్యులు అజయ్‌కుమార్, తేజ పాల్గొన్నారు.

●మెరకముడిదాం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని స్త్రీశిశుసంక్షేమశాఖ పర్యవేక్షకురాలు తాడ్డి శ్రీదేవి తెలిపారు.గర్భాం పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన స్వస్థనారీ స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు.

●గుర్ల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి):పాలవలసలో స్వస్థనారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శ్రీధర్ మహిళలఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారుకార్యక్రమంలో సన్యాసినాయుడు, శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



శృంగవరపుకోట: జామి బజారు సెంటర్ దుర్గామాతకు సారె సమర్పించిన భక్తులు

దుర్గాదేవికి సారె సమర్పణ

శృంగవరపుకోట (జామి), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జామి బజారు సెంటర్ వద్ద గోస్తానీ మహిళ సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన దుర్గాదేవికి సంతపేట వాసులు సారె సమర్పించారు. 30 రకాల వంటలతో పండ్లు, చీర, పసుపు కుంకమలతో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అర్చకులు రవికుమార్ శర్మ సామూహిక లలిత సహస్రనామం నిర్వహించారు. అలాగే కుమరాం షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవిని బుధవారం అన్నపూర్ణగా అలంకరించారు.

● చీపురుపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చీపురు పల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారు బుధవారం గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో కుం కుమ పూజలు, చండీయాగం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, ఈవో బండ్లమూడి శ్రీనివాస్, అర్చకులు ఆరవిల్లి రవి పాల్గొన్నారు.

● రాజాం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోనవదుర్గ అమ్మవారి ఉత్సవాలను ఈవో పి.శ్యామలరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.ఇక్కడ ఏర్పాటుచేసిన దుర్గాదేవినిభక్తులతోపాటు భవానిలు అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

●నెల్లిమర్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సంప్రదాయం ఉట్టిపడేలా కోలాటం, తప్పెటగుళ్ల, పులి వేషాలు, ముగ్గులు పోటీలు చేపడుతున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమతో సారే కార్యక్రమాన్ని కమిటీ ప్రతినిధులు నిర్వహించారు.

పొలంలో పనిచేస్తుండగా నక్కదాడి

● జక్కువలో ముగ్గురు రైతులకు గాయాలు

మెంటాడ,సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జక్కువ గ్రామానికి చెందిన ముగ్గురు రైతులపై బుధవారం నక్క దాడిచేసింది. పొలంలో పని చేస్తుండగా నక్క గంట వ్యవధిలో ముగ్గురిపై దాడి చేసి గాయపరిచినట్లు కె.అప్పలనాయుడు, డి.శ్రీరామ్,చప్ప తవుడమ్మ చెప్పారు. క్షతగాత్రులు గజపతినగరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

కుక్క కాటేయడంతో బాలికకు..

శృంగవరపుకోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలిక బ్లేస్సీపై బుధవారం కుక్కదాడి చేసి విచక్షణరహితంగా కాటేసింది. దీంతో బాలిక తీవ్రంగా గాయపడడంతో స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది.

గంజాయి అక్రమ రవాణాను నియంత్రించాలి

విజయనగరం క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి అక్రమ రవాణాని నియంత్రించాలని, మహిళల భద్రతకు చర్యలు చేపట్టాలని, సైబర్ నేరాల నియంత్రణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, రహదారి ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఐజీ గోపీనాథ్ జట్టీ సూచించారు. ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఏఆర్ దామోదర్ విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీని బుధవారం డీఐజీ కార్యాలయంలో కలిశారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

వంగర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల గాలులతో కూడిన వర్షాలుపడే అవకాశంఉండడంతో గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని తహల్దార్ రామారావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో సిబ్బందితో సమావేం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నదీతీరాల్లో ప్రజలు అప్రమత్తం కావాలన్నారు.నాగావళిలో నాటుపడవ ప్రయాణాలు, మడ్డువలస రిజర్వాయర్‌లో చేపలవేట పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు.

పీ-4లో ఇబ్బందులను అధిగమించాలి: ఎస్‌ఆర్‌పీ



మాట్లాడుతున్న శ్రీధర్

నెల్లిమర్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పీ4 విధానంలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులను అధిగమిస్తే మంచి ఫలితాలు వస్తాయని స్టేట్ రిసోర్స్‌పర్సన్ జి.శ్రీధర్ పేర్కొన్నారు.బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీ-4విధానంపై డిప్యూటీ ఎంపీడీవో శంకర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్లు పంచాయతీ,సచివాలయ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ పీ-4 పాలసీ 2047వరకు కొనసాగుతుందని చెప్పారు. విధానంలో భాగంగా గ్రామాల్లో బంగారు కుటుంబాలను, మార్గదర్శకులను గుర్తించాలని సూచించారు. ఒక్కో ఉద్యోగి 20 కుటుంబాలను పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు.

●భోగాపురం, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం పేదరికాన్ని నిర్మూలించడం, అణగారిన కటుంబాల ఆర్థిక, సామాజికస్థితిని పెంచడం(పీ-4)పై కార్యదర్శులు,డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోలకు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో స్వరూపారాణి మాట్లాడుతూ గ్రామాల్లో పి-4పై అవగాహన కల్పించి ఉపయోగాలు తెలియ జేయాలన్నారు.

ఆర్థిక స్వావలంబన కోసమే పీ-4

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్వాలంబన కోసం ప్రభుత్వం పీ-4 విధానాన్ని అమలు చేస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. బుధవారం విజయనగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో పీ-4ని సమర్థవంతంగా అమలు చేసే విధానంపై వెల్ఫేర్, శానిటేషన్, ఉమెన్ ప్రొటెక్షన్, హెల్త్, ఎడ్యుకేషన్ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా నల్లనయ్య మాట్లాడుతూ, ఇప్పటి వరకూ జరిగిన సర్వేలో నగరపాలక సంస్థ పరిధిలో 3,760 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు.ఇందులో వివిధ రూపాల్లో సాయం అందించేందుకు 299 మంది మార్గదర్శకులు ముందుకువచ్చారన్నారు. ఇంకా 2,397 కుటుంబాలను దత్తత తీసుకోవలసి వుందన్నారు. కార్యక్రమంలో టీపీఆర్‌వో సింహాచలం పాల్గొన్నారు.

పెంచిన ఇంటి పన్నును రద్దు చేయాలి

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీజీనగర్‌లో పేదల ఇళ్లకు పెంచిన ఇంటి పన్నును రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్‌చేశారు.బుధవారం నగరపాలకసంస్థలోని 55వ సచివాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఎల్‌బీజీ నగర్‌లో పేదలు గుడిసెలు కట్టుకుని జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోప్రకారం సంవత్సరానికి రూ 54 రూపాయలు మాత్రమే పన్ను వేయాలని కాని, ఆరునెలలకే రూ రెండు వేలు పైన పన్నులు వేస్తున్నారని తెలిపారు.అనంతరం సచివాలయం ప్రతినిధికి వినతిపత్రం అందించారు.కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు రమణమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో శారీరక అభివృద్ధి: సీడీపీవో

నెల్లిమర్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే మానసిక, శారీరక అభివృద్ధి జరుగుతుందని ఐసీడీఎస్ విజయనగరం సీడీపీవో ప్రసన్న తెలిపారు. బుధవారం మండలంలోని అలుగోలు అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణమాసంకార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు చిన్నారులకు కూడా పోషక విలువలుగల ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారి అనీల్‌కుమార్, పద్మావతి,అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమా, అంగన్‌వాడీ బోధకులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే నగర పంచాయతీలో మొయిద జంక్షన్-2 సచివాలయం పరిధిలో హెల్త్ అండ్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ త్రినాథ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాదిగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.త్రినాథ, డాక్టర్ శిరీష, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని, కౌన్సిలర్ కళ్యాణపు సత్యనారాయణ, టీడీపీ నాయకుడు ముడుమంచి లక్ష్మణరావు పాల్గొన్నారు.

రామతీర్థంలో ధ్వజారోహణ



వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న పురోహితులు

నెల్లిమర్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రామతీర్థంలోని రామస్వామివారి దేవస్థానం రామతీర్థం రామస్వామి దేవాలయంలో వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రాతఃకాలార్చన బాలభోగం తరువాత యాగశాలలో అగ్ని ప్రతిష్ఠాపన వాస్తు హోమం, గ్రామ బలిహరణ, ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌కు బలరాంపేట విద్యార్థిని ఎంపిక

సంతకవిటి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బలరాంపేటకు చెందిన బోర వెంకటలక్ష్మి జాతీయస్థాయి అథ్లెటిక్స్‌పోటీలకుఎంపికయ్యింది. గుంటూరులోని నాగార్జునవర్సిటీలో జరగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్‌పోటీల్లో పాల్గొనుం ది. గతనెలలో చీరాలలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి, జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యింది.

బాడీ బిల్డింగ్ పోటీలకు చీపురుపల్లి వాసి..

చీపురుపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):చీపురుపల్లి పట్టణానికి చెందిన రెడ్డి లక్ష్మునాయుడు జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 14న విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సంపాదించిన నాయుడు జాతీయ పోటీలకు అర్హత సాధించారు. కాగా లక్ష్మునాయుడును వైసీపీ జిల్లా ప్రచారవిభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, గవిడి సురేష్ తదితరులు అభినందించారు.

అడుగడుగునా నీరా'జనం'

(ఏడో పేజీ తరువాయి)

మహారాజా ఆసుపత్రి కూడలి, ఆర్అండ్‌బీ జంక్షన్, ఎత్తుబ్రిడ్జి మీదుగా రైల్వే స్టేషన్ రోడ్డు, వనంగుడి నుంచి ముందుకు సాగింది. అక్కడి నుంచి ఎన్‌సీఎస్ రోడ్డు, డాబాగార్డెన్ మీదుగా కన్యకాపరమేశ్వరీ ఆలయం, గంటస్తంభం, ఎంజీ రోడ్డు, చదురుగుడి ముందు పక్కకు తిరిగి శివాలయం మీదుగా హుకుంపేటకు చేరుకుంది. ఆ సమయానికి హుకుంపేట వాసులు కూడా భారీ ఎత్తున హాజరై సిరిమానుకు పూజలు చేశారు. హుకుంపేటకు సిరిమాను చెట్టు రాత్రి 11.45 గంటలకు చేరింది.

● గంట్యాడలోని కొండతామరాపల్లి నుంచి బయలుదేరిన సిరిమాను విజయనగరం సమీపంలోని రామవరం జాతీయ రహదారి వంతెన కిందకు వచ్చేసరికి సిరిమాను తరలించే బండి చక్రం బరువుకు ఇరిగిపోయింది. దీంతో బండి కదలడానికి అటంకం ఏర్పడింది. వెంటనే నిలిపేసి పాత చక్రాన్ని తొలగించి మరో చక్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి సిరిమాను, ఇరుసుమానులతో బయలుదేరిన బళ్లు, మెలమెల్లగా విజయనగరం చేరుకున్నాయి.

కొండతామరాపల్లిలో కోలాహలం

గంట్యాడ మండలంలోని కొండతామరాపల్లి గ్రామంలో సిరిమాను చెట్టుకు బుధవారం ఉదయం 8.30 గంటలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గొడ్డలితో గాట్లు పెట్టి చెట్టు తొలగింపు ప్రక్రియను ప్రారంభించారు. మధ్యాహ్నం 12.30కు చెట్టును మొదలు నుంచి వేరు చేశారు. ఇరుసుమాను చెట్టు ను కూడా తొలగించారు. పూజలు చేసిన అనంతరం మూడు గంటల సమ యంలో చెట్ల తరలింపు నాటు బళ్లపై ప్రారంభమైంది.

షెడ్యూల్డ్ ఏరియాలో కలుపుతారా?

(ఏడో పేజీ తరువాయి)

వేస్తోంది. జిల్లాలో 40వేల మంది వరకు గిరిజనులు నివశిస్తున్నారు. షెడ్యూల్డ్ ఏరియా పరిధిలో ఉన్న గిరిజనుల వలే భాష, సంస్కృతీ సంప్రదాయాలు, జీవన విధానం ఉంది. అక్కడున్న తెగలు, సామాజిక వర్గాలు జిల్లాలోనూ ఉన్నాయి. గిరిశిఖర ప్రాంతాల్లో విసిరేసినట్లు ఉంటే నివాసాలు, రాళ్ల రప్పలతో రహదారులు, అనారోగ్యంతో బాధపడేవారిని డోలీ కట్టి తరలించడం ప్రతిరోజూ కనిపించే దృశ్యాలే.

కొండ శిఖరానే అధికం

శృంగవరపుకోట నియోజకవర్గంలో గిరిజన గూడేలకు కొదవలేదు. శృంగవరపుకోట మండలం దారపర్తి, మునపరాయి, రాయిపాలెం, చప్పన గెడ్డ, పల్లపు దుంగాడ, పోర్లు, రంగవలస, ధూళిపోర్లు, కురిడి, గూన పాడు-1, గూనపాడు-2, చిట్టింపాడు, రేగపుణ్యగిరి, గిరిలోవ గ్రామాలు పూర్తిగా కొండ శిఖరాన ఉన్నాయి. ఇదే విధంగా వేపాడ మండలం మారిక గిరిజన గ్రామం గిరిశిఖర గ్రామమే. మూలబొడ్డవర, దబ్బగుంట, మరుపల్లి, లచ్చుందొరపాలెం, మెట్టపాలెం, లక్ష్మీపురం, బొడ్డపాడు, గాదిల్లోవ వంటి గ్రామాలు మైదానమా.. కొండ శిఖరమా అన్నట్లు ఉన్నాయి. ముషి డిపల్లి, కిల్తంపాలెం, మూలబొడ్డవర పంచాయతీ పరిధిల్లో శతశాతం, 70 శాతం గిరిజనులున్న అవాసాలు ఉన్నాయి. గంట్యాడ మండలం దిగువ కొండపర్తి (డీకే పర్తి) కొండపైనే ఉంటుంది. ఇవేవీ షెడ్యూల్డ్ ఏరియాలో లేవు. దీంతో ఐటీడీఏ అందించే ప్రయోజనాలు వీరికి దూరం.

వైద్యం దూరం

జిల్లానుంచి ఐటీడీఏ తరలిపోయినప్పటికీ కొన్ని అంశాల్లో సహకారం ఉంటోంది. ఇందుకు జిల్లాలో ప్రత్యేకంగా ఓ అధికారిని నియమించి సేవలు అందిస్తున్నారు. వైద్యం వరకు సేవలను నిలిపేసారు. గతంలో ఉత్తరాంధ్ర ఆరోగ్యప్రదాయనిగా చెప్పుకొంటున్న కింగ్ జార్జ్ హాస్పటల్ (కేజీహెచ్)లో ఉచిత వైద్యంతో పాటు మందులు అందించేవారు. ఇప్పుడు ఐటీడీఏ లేకపోవడంతో నిలిపేసారు. కొద్దిరోజుల క్రితం శృంగవరపుకోట మండలం మూలబొడ్డవర పంచాయతీ శివారు గాదెల్లోవకు చెందిన గిరిజన యువకుడు రాజేష్ బోన్ క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో కేజీహెచ్‌లో చేర్చారు. మూడు, నాలుగు రోజులకు రక్తం ఎక్కించాల్సి వచ్చేది. ఐటీడీఏ అధికారుల నుంచి అనుమతి పత్రం తెస్తేనే ఇస్తామని కేజీహెచ్ అధికారులు, ఐటీడీఏ పరిధిలో మీ జిల్లా లేనందున అనుమతి ఇవ్వలేమని ఈ శాఖ అధికారులు అనడంతో ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును కలిసారు. అతని సిఫార్స్‌తో ఓ నాలుగు సార్లు రక్తం ఇచ్చిన కేజీహెచ్ అధికారులు తరువాత నిలిపేసారు. మందులు, రక్తం ఎక్కించేందుకే ఈ గిరిజన పేద కుటుంబం రూ.1.30 లక్షలు అప్పుచేయాల్సి వచ్చింది. ఇదోక ఉదాహరణ మాత్రమే. వీరు షెడ్యూల్ పరిధిలో లేకపోవడంతో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోను నష్టం జరుగుతోంది..

పాడేరు ఐటీడీఏ సహకారమూ లేక..

పోడు వ్యవసాయం, గిరిజన ఉత్పత్తుల విక్రయాలకు ఐటీడీఏ నుంచి గతంలో సహాయం అందేది. దీనిని కూడా కోల్పోయారు. జిల్లాలో శృంగవరపుకోట, వేపాడ, గంట్యాడ మండలాల పరిధిలో వున్న కొండ శిఖర గిరిజన గ్రామాలన్నీ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలానికి చెందిన గిరిజన గ్రామాలను ఆనుకుని ఉన్నాయి. వీరు సాగు చేస్తున్న పోడు భూములు అక్కడ ఉండడంతో హక్కులు పొందలేక పోతున్నారు. ఆ జిల్లా పరిధిలోని పాడేరు ఐటీడీఏ అధికారులు పోడు వ్యవసాయ భూములతో పాటు రహదారుల సదుపాయానికి అనుమతులు ఇవ్వడం లేదు. జిల్లా పరిధిలో వున్న ఈగ్రామాలకు అల్లూరి జిల్లా అనంతగిరి మండల భూభాగం అక్కడక్కడ ఉంది. దీంతో ఈ చిక్కులు వస్తున్నాయి.

1/70 యాక్ట్ వర్తించక..

షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న భూములకు 1/70 యాక్టు రక్షణగా ఉంటుంది. ఈ యాక్టు వున్న ప్రాంతల్లో గిరిజనేతరులు భూములు కొను గోలు చేసే అవకాశం లేదు. షెడ్యూల్డ్ ఏరియాలో లేని గిరిజన గ్రామాలకు ఈ యాక్టు వర్తించదు. దీంతో పట్టణాలు, నగరాల్లో నివసిస్తున్న రియల్టర్‌లు గిరిజనుల భూములపై కన్నేశారు. వీరి ఆర్థిక అవసరాలను గుర్తించి డబ్బు ఆశ చూపించి వీరు సాగు చేసుకుంటున్న భూములను తక్కువ ధరకు లాక్కుంటున్నారు. ప్రభుత్వం సాగుకు ఇచ్చిన అసైన్డ్ భూములనూ వదల్లేదు. కొంత మంది భూ యజమానులు ఎవరి వద్దయితే కొనుగోలు చేసారో వారి పొలంలోనే కూలీగా పెట్టుకున్నారు. అధికారులు ఎవరైనా వస్తే పీఓటీ యాక్టు నుంచి తప్పించుకొనేందుకు తమ అధీనంలో భూములు ఉన్నాయని చెప్పేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

జిందాల్‌కు ఇచ్చేవాళ్లం కాదు

ఎస్.కోట మండలం కిల్తంపాలెం, మూలబొడ్డవర, ముషిడిపల్లి, చీడిపాలెం, చినఖండెపల్లి గ్రామాల పరిధిలో 2006లో అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించి జిందాల్ యాజమాన్యానికి ఇచ్చిన 866 ఎకరాల్లో అత్యధిక శాతం గిరిజనులకు చెందినవే. ఈ గిరిజనులు షెడ్యూల్డ్ ఏరియాలో వుండుంటే వీటిని ఈ పరిశ్రమకు అప్పగించే వారే కాదని ఇక్కడి గిరిజనుల నోటి నుంచి వినిపిస్తోంది.

షెడ్యూల్డ్ ఏరియా పరిధిలో చేర్చాలి

జిల్లాలో అత్యధికంగా గిరిజన జనాభా శృంగవరపుకోట నియో జకవర్గంలో ఉంది. అలాగే గంట్యాడ, మెంటాడ, బొండపల్లి, గజపతినగరం మండలాల్లోనూ గిరిజన గ్రామాలున్నాయి. వీటన్నింటినీ షెడ్యూల్డ్ ఏరియా లో చేర్చాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. షెడ్యూల్డ్ ఏరియాలో గ్రామా లను చేర్చాలంటే ఐటీడీఏ ఉండాలి. దీన్ని శృంగవరపుకోటలో ఏర్పాటు చే యడంతో పాటు జిల్లాలోని గిరిజన గ్రామాలన్నింటినీ షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చేలా మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కృషి చేయాలి.

- జె.గౌరీష్, గిరిజన సంఘ నాయకుడు

విజయవాడకు కొత్త మాస్టార్లు

(ఏడో పేజీ తరువాయి)

మెడికల్ ఆఫీసర్లు కూడా వారి వెంట ఉన్నారు. మధ్యాహ్నం పాయకరావుపేటలో భోజనం అందించారు. సాయంత్రం దివాన్ చెరువు వద్ద టీ కోసం బస్సులను నిలిపారు. రాత్రికి వారంతా విజయవాడ చేరుకున్నారు. ఉమ్మడి జిల్లావాసులకు గూడవల్లి కేకేఆర్ గౌతమ్‌లో బస, భోజన ఏర్పాట్లు చేశారు. కొత్త గురువులు మరి కొద్ది గంటల్లో పోస్టింగ్ ఆర్డర్లు తీసుకోనున్నారు.

వినతులపై సానుకూలంగా వ్యవహరించాలి

(ఏడో పేజీ తరువాయి)

మ్యూటేషన్లు, ఆర్‌వోఆర్ తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002 ఓటర్ల జాబితాతో 2025 ఓటర్ల జాబితాను మ్యాప్ చేయాలని తెలిపారు. ఓటర్ల సవరణ కోసం అందిన ఫారం 6,7,8లను నిర్దేశిత గడువులోగా డిస్పోజ్ చేయాలని సూచించారు. ఈ-ఆఫీస్‌పై వర్కుషాపు నిర్వహించి త్వరలో అధికారులందరికీ అవగాహన కల్పిస్తామన్నారు.

అన్నపూర్ణదేవిగా అమ్మవారు

బొబ్బిలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని గొల్లపల్లి దాడితల్లి అమ్మవారిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పిండిప్రోలు మణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి 108 రకాల ప్రసాదాలను నివేదించారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని బంగారమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రకాశ్ పండా ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా ప్రత్యేకంగా అలంకరించి పెద్దఎత్తున అన్నం వండి అమ్మవారికి నివేదించారు.


కృష్ణాపురంలో...


బంగారమ్మతల్లికి..

అనంతరం అన్నదానం చేశారు.

● బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురంలో నిర్వహిస్తున్నదేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.


దాడితల్లికి 108 రకాల ప్రసాదాల నివేదన

రైల్వే మూడో లైన్ పనుల పరిశీలన


రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న రైల్వే అధికారుల బృందం

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపెంట సమీపంలో జరుగుతున్న రాయగడ-విశాఖపట్నం రైల్వే మూడో లైన్ పనులను విశాఖ డివిజన్ రైల్వే అధికారులు బృందం బుధవారం పరిశీలించింది. వేగావతి నది మీదుగా నిర్మించిన రైల్వే బ్రిడ్జిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ట్రైల్ రన్ నిర్వహించిన సమయంలో స్టేషన్లలో రైల్వే లైన్‌ను ప్రయాణికులు దాటకుండా ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అధికారుల బృందంలో రైల్వే భద్రత కమిషనర్ బ్రిజేష్ మిశ్రా, డీఆర్ఎం లలిత్ బోరో తదితర సిబ్బంది పాల్గొన్నారు.

●బాడంగి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విజయనగరం-రాయిగడ రైల్వే మూడో లైన్‌ను బుధవారం రైల్వే సేఫ్టీ చీఫ్ కమిషనర్ బ్రిజేష్ మిశ్రా, డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీలలిత్ బోరాలు బుధవారం పరిశీలించారు. సుమారు మూడు రోజులపాటు పరిశీలన అనంతరం రైల్వే ట్రాక్ వాడుకలోకి వస్తుందని వారు తెలిపారు.

భోగాపురంలో పనిచేయలేం

(ఏడో పేజీ తరువాయి)

నిర్వహిస్తున్న మహిళకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. ఈమె విధుల్లో ఉన్నప్పుడు అభివృద్ధి తీర్మానాలు, ఉపాధి హామీ పథకం క్షేత్రసహాయల సమస్య లపై రాజకీయ ఒత్తిడి పెరిగింది. దీంతో ఆమె కూడా సెలవు పెట్టి వెళ్లి పోవడానికి ప్రయత్నాలు చేశారు. అయితే ఇన్‌చార్జి ఎంపీడీవో సెలవుపెడితే తనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారేమోనని ముందస్తు ఆలోచనతో ఏవోగా ఉన్న అధికారి సెలవు పెట్టి వెళ్లిపోయారు. ఇటీవల స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ముంజేరు గ్రామానికి చెందిన సర్పంచ్ పూడి నూకరాజు ఇంటి పన్ను బకాయి చెల్లించలేదంటూ ఎమ్మెల్యే నాగమాధవిని ప్రశ్నించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే, సర్పంచ్ మధ్య జరిగిన మాటల అంశం జిల్లా అంతా హాట్‌టాపిక్‌గా మారింది. రెండు రోజుల క్రితం మండలపరిషత్ కార్యాలయంలో కలెక్టర్ నిర్వహిస్తున్న ఈసీకి సంబంధించి ఎంపీడీవో గాయత్రి, కార్యదర్శులు హాజరవగా.. అక్కడకు ఎమ్మెల్యే నాగమాధవి భర్త లోకం ప్రసాదు వచ్చారు. పంచాయతీల్లో ఏం జరుగుతోందంటూ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పంచాయతీల్లో ఏపని చేసినా చెప్పడంలేదంటూ ఆవేశంగా మాట్లాడారు. దీంతో కార్యదర్శులు తీవ్ర అసంతృప్తికి లోనై కొంతమంది కన్నీరు పెట్టుకున్నారు. దీంతో ఒత్తిడి తట్టుకోలేని ఇన్‌చార్జి ఎంపీడీవో గాయత్రి మరుసటి రోజు నుంచి లాంగ్‌లీవ్‌పై వెళ్లిపోయారు. అలాగే కార్యదర్శులు కూడా రాజకీయ వత్తిళ్లు తట్టుకోలేక సెలవు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. తహసీల్దార్ కూడా ఇక్కడి నుంచి వెళ్లిపోవడానికి సిద్ధపడుతున్నారని తెలిసింది. రెవెన్యూ కార్యాలయ సిబ్బంది సైతం బదిలీ ఎంత వేగంగా అవుతుందానని ఎదురుచూస్తున్నారు.

వర్షం వస్తే వణుకే

(ఏడో పేజీ తరువాయి)

ప్రాణాంతకమని తెలిసినా పీకల్లోతు ప్రవాహంలో మెంటాడ వచ్చి పచారీ సామాగ్రి, ఇతర అవసరాలు తీర్చుకొని తిరిగి వెళ్తుంటారు. క్షేమంగా ఇళ్లకు చేరేవరకు వారికి టెన్షనే. ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తితే మృత్యువును ఆహ్వానించడం మినహా వేరే గత్యంతరం లేదు. నదిదాటే వీలులేక గతంలో ప్రాణనష్టం జరిగిన సందర్భాలెన్నో. విధిలేని పరిస్థితుల్లో చావుకు ఎదురెళ్లడం వారికి అలవాటుగా మారిపోయింది. ఈ క్రమంలో జలసమాధి అయినవారెందరో. తాజాగా పశువుల కాపరి చల్లకృష్ణ గల్లంతయ్యారు. ఇంకా ఆయన ఆచూకీ లభించలేదు. బుధవారం జగన్నాధపురం వద్ద పైపు కల్వర్టు సమీపంలో ఇద్దరు వ్యక్తులు కొంతదూరం కొట్టుకుపోయి అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డారు. ఏటా వర్షాకాలంలో పశుసంపదను కూడా చంపావతి బలిగొంటోంది.

● రెల్లుగూడెం సహా పలు శివారు గ్రామాలు చంపావతి నదిని ఆనుకునే ఉన్నందున చాలాసార్లు నదీనీరు ఊళ్లలోకి వచ్చి స్థానికులను కంటికి కునుకు లేకుండా చేస్తోంది.గండం నుంచి గట్టెకించాలని వారు ప్రత్యేక పూజలు చేస్తుంటారు.

● సాధారణ ప్రవాహ సమయంలో నదిని దాటేందుకు గ్రామస్థులు సిమెంట్ కరెంటు స్తంభాలను నదికి రెండువైపులా అడ్డంగా వేసి రాకపోకలు సాగిస్తున్నారు. అలాంటప్పుడు కూడా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అదుపుతప్పి నదిలో ఇసుక తవ్వకాలు జరిపిన చోట పడిపోతే ఆ ఊబినుంచి బయటపడలేక మృత్యువాత పడుతున్నారు.

● వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వాలకు ప్రతిపాదనలు వెళ్లినప్పటికీ అంచనా వ్యయం పెరిగిందని ఒకసారి, తగ్గిందని ఒకసారి... ల్యాండ్ సేకరణకు ఆటంకాలు ఇంకోసారి ఇలా ప్రయత్నాలు ప్రతి పాదనలు దశలోనే ఆగిపోయాయి. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన పీడిక రాజన్నదొర సైతం కినుక వహించారు.

●ఇన్నాళ్లూ ఓపికపట్టిన ఆయా గ్రామాలు మంగళ, బుధవారాలనాటి పరిణామాలతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో అమీతుమీ తేల్చుకుంటామని స్పష్టం చేస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణ సిద్ధంచేస్తామని కూడా ఖరాకండిగా చెబుతున్నారు.

నలుగురిని మింగేసిన చంపావతి

ఆగూరు మల్లేడవలస మధ్య(రిజర్వాయర్ ఆనుకున్న ప్రాంతంలో)లో పదిహేనేళ్లలో నది నలుగురిని మింగేసింది. పైల అప్పలస్వామి, రాళ్ళపల్లి లక్ష్మి, పల్లి అప్పలస్వామి, చింపుల లక్ష్మి నదిలో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు.

కుచించుకుపోతున్న నది

చంపావతి నది కుచించుకుపోతోంది. ఆంధ్ర నుంచి భోగాపురం వద్ద సముద్రంలో కలుస్తున్న వరకు నది ఇరువైపులా ఆక్రమణకు గురయ్యింది. పంట పొలాలు ఏర్పాటు, భవన నిర్మాణాలు జరిగిపోయాయి. అంతటితో ఆగకుండా నిత్యం వేలాది నాటు బండ్లు, వందలాది ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు.

లభించని పశువుల కాపరి ఆచూకీ

చంపావతి నదిలో మంగళవారం గల్లంతైన మెంటాడ గ్రామానికి చెందిన పశువుల కాపరి చల్లా కృష్ణ(43) ఆచూకీ లభించలేదు. చింతలవలస ఐదో బెటాలియన్ నుంచి వచ్చిన ఎస్డీఆర్ఎఫ్ బృందాలు బుధవారం రోజంతా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రిజర్వ్ ఎస్ఐ కె.భాస్కరరావు నేతృత్వంలో 16మంది సిబ్బంది బృందాలుగా విడిపోయి చంపావతిలో దాదాపుగా కిలోమీటరు పొడవునా జల్లెడ పట్టారు. ఆచూకీ కోసం విరామం లేకుండా శ్రమించారు. సాయంత్రం చీకటిపడేవరకు గాలింపు కొనసాగించారు. ఫలితం లేకపోయింది. గురువారం గాలింపు కొన సాగిస్తామని ఎస్ఐ భాస్కరరావు చెప్పారు.

టీడీపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు

బొబ్బిలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాడంగి మండలం గూడెపువలస ఎంపీటీసీ సభ్యుడు పూడి సింహాచలం, మాజీ సర్పంచ్ పూడి ఆనందరావుతో పాటు పలువురు వైసీపీని వీడి టీడీపీలో బుధవారం చేరారు. స్థానిక కోటలో బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాదరంగా ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెంటు మాట్లాడుతూ గూడెపువలస గ్రామస్థులు మొదటి నుంచి టీడీపీ అభిమానులుగా తన తండ్రి జయప్రకాశ్ అనుచరులుగా కొనసాగేవారన్నారు. అనివార్య కారణాలతో వైసీపీలో చేరినప్పటికీ అందులో ఇమడలేక సొంతగూటికి చేరుకున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, బొబ్బిలిలో ఎమ్మెల్యే బేబీనాయన నాయకత్వానికి ఆకర్షితులై వారంతా టీడీపీలోనికి మళ్లీ వచ్చారన్నారు. టీడీపీలో చేరిన వారిలో ఏగిరెడ్డి తవిటినాయుడు, పూడి సత్యం, మూడడ్ల పైడితల్లి, పూడి చంటినాయుడు, శంకరరావు, రెడ్డి లక్ష్మణరావు తదితరులతో సుమారు వంద కుటుంబాల టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, బాడంగి వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు యజ్జల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ లబ్ధిదారులకు త్వరలో పట్టాలు

రామభద్రపురం, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు 3 నెలల్లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్టు డీఎల్‌డీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం, గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో రెండో విడతగా స్వామిత్వ కింద 80 గ్రామాలను గుర్తించి 45, 586 ఇళ్ల వివరాలు నమోదు చేశామన్నారు. సమావేశంలో మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీవో సన్యాసిరావు, హౌసింగ్ ఏఈ మత్స వెంకటేష్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాకర్ల సీజ్

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెంట గ్రామం శివారున వేగావతి నది నుంచి బుధవారం సాయంత్రం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులకు అందిన సమాచారం మేరకు ఆర్ఐ రాంకుమార్ వెళ్లి రెండు ట్రాక్టర్లు పట్టుకున్నారని తహసీల్దార్ శ్రీను తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలించ కూడదని ఇటీవల పట్టుబడ్డ ట్రాక్టర్ల యజమానులతో ఆర్డీవో రామ్మోహనరావు సమావేశం నిర్వహించి హెచ్చరించినప్పటికీ వారిలో మార్పు కనిపించలేదు.

బాడంగి గ్రంథాలయానికి మెగాఫోన్

బాడంగి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సౌత్ సెంట్రల్ రైల్వేలో చీఫ్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్, బొబ్బిలికి చెందిన చింతపల్లి సత్యారావు బాడంగి గ్రంథాలయానికి రూ.10,500లు విలువైనా మెగాఫోన్‌ను బుధవారం వితరణ చేశారు. సత్యారావుకు బాడంగి గ్రంథాల యాధికారి ఆర్. దుర్గాప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

గంజాయిని నిర్మూలిస్తాం

రామభద్రపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు అన్నారు. కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వినియోగించినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో గంజాయి నిర్మూలనకు నిఘా ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని కొట్టక్కి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. తనిఖీల్లో ఎస్ఐ వెలమల ప్రసాదరావు ఉన్నారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

రామభద్రపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఐసీడీఎస్ పీవో ఎం.వరహాలమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేరులతో మాట్లాడుతూ కుటుంబానికి పెద్ద దిక్కు అయిన మహిళకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా ఈ నెల 15 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలన్న దానిపై అవగాహన కల్పిస్తామన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు.

పేదరిక నిర్మూలన కోసమే పి-4

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే పి- 4 లక్ష్యం అని ఇన్‌చార్జి ఎంపీడీవో అల్లు భాస్కరరావు అన్నారు. మార్గదర్శులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని పేదరికం నుంచి వారిని శాశ్వతంగా బయటకు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాలసీ అమలు విధానాలు, లక్ష్యాలు, ప్రాధాన్యతలను ఆయన వివరించారు.

●రామభద్రపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పి-4పై గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో సన్యాసిరావు మాట్లాడుతూ పి-4 యాప్ ఉపయోగించడంపై సలహాలు, సూచనలు ఇచ్చారు. బంగారు కుటుంబాల దత్తత, సేవలు గుర్తించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మరడ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములు నాయుడు, జూనియర్ అసిస్టెంట్ చిట్టూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రత్యేకంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని పక్కి పీహెచ్‌సీ డాక్టర్ ఎం.తనూజ అన్నారు. శివడవలసలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.